కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న నాయకులు

నగర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ పి.కోటేశ్వర రావు - కర్నూలు స్మార్ట్ సిటీ మిషన్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని మినీ కన్ఫరెన్స్ హాలులో కర్నూలు మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజ , జిల్లా ఎస్పి సిద్దార్థ్ కౌశల్ తో కలిసి కర్నూలు స్మార్ట్ సిటీ మిషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బిర్లా గేట్ ఫ్లై ఓవర్ క్రింద భాగంలో రూ.1.83 కోట్ల వ్యయంతో కె-3 (కర్నూలు ఖానా ఖజానా) ఈట్ స్ట్రీట్ పనుల పురోగతి పై కలెక్టర్ అరా తీశారు. మునిసిపల్ కమిషనర్ స్పందిస్తూ ఇప్పటివరకు రూ.1.50 కోట్లకు సంబంధించిన పనులు పూర్తి చేశామని, ఈట్ స్ట్రీట్కు సంబంధించి మిగిలిన పనులకు నిధులు విడుదల చేసేందుకు కర్నూలు స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ అప్రూవల్ కావాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలకు కమిటీ ఆమోదం తెలిపింది..ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకే ప్లాట్లు

ఎమ్మిగనూరులో స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు : ఎంఐజి లే ఔట్ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ద్వారా మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకే ప్లాట్లు అందుబాటులో ఉండబోతున్నాయని, జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎమ్మిగనూరు మండలం బనవాసిలో అన్ని సౌకర్యాలతో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ఏర్పాటు అవుతుందన్నారు. శనివారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎంఐజి లే ఔట్ జగనన్న స్మార్ట్ టౌన్సిఫ్ అంశంపై కుడా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు, మధ్య తరగతి ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్ (ఎంఐజి) పేరుతో లేఅవుట్ల రూపొందించి తక్కువ మొత్తానికే పట్టణ పరిధిలో 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్' పేరుతో సౌకర్యాలు, అన్ని అనుమతులతో కూడిన ఇంటి స్థలాన్ని తక్కువ ధరకే అందిస్తోందన్నారు. ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలో 110 ఎకరాల ప్రభుత్వ భూమిని తీసుకొని దానికి అనుగుణంగా లే ఔట్ సిద్ధం చేసి 1106 ప్లాట్లు ఏర్పాటు చేశామని వాటికి ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ అనుమతులతో పాటు కుడా అప్రూవల్ కూడా రావడం జరిగిందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

1106 ప్లాట్లను 3 రకాలుగా విభజించారు. 3 సెంట్లకు సంబంధించి 447, 4 సెంట్లకు సంబంధించి 460, 5 సెంట్లకు సంబంధించి 199 ప్లాట్లు ఉన్నాయని వివరించారు. ఇన్‌ఫ్రాస్టర్ సంబంధించి రూ.64 కోట్లతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందన్నారు. .జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ఎంట్రెన్స్ వద్ద అద్భుతమైన ఆర్చి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈటౌన్ షిప్‌కు సంబంధించి ఒక దృశ్య రూపకం తయారు చేయించినట్లయితే ప్రజల వద్దకు బాగా చేరుతుందని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కుడా ప్లానింగ్ అధికారి విజయ భాస్కర్ పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను
ఉపసంహరించుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని సిఐటియు ఎఐటియుసి కార్మిక ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. విశాఖ నగరంలో 700 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్న వారికి మద్దతుగా విశా ఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఉప సంహరించుకోవాలని సిఐటియు ఎఐటియుసి కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.విజయ్, ఎఐటియు పట్టణ అధ్యక్షులు వెంకటేశులు అధ్యక్షతన జరిగి న నిరసనలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్పలు మాట్లాడుతూ కేంద్రంలో ఏర్పడిన బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దొడ్డిదారిన బలహీన పరచడానికి కుట్రలో భాగంగా ప్లాంటుకు గుండెకాయ లాంటి బ్లాస్ట్ పర్నేష్-3ను 14 మాసాలుగా మూసివేసి ఉత్పత్తిని తగ్గించిందన్నారు. దీని ద్వారా ప్లాంట్ నష్టాల్లో ఉందని చూపించి నష్టాలు ఎందుకు వస్తాయన్నారు. ఆలోచించకుండా, రైల్వే ర్యాక్ లు ఇవ్వకుండా, ప్లాంటుకు ప్రభుత్వ గనులు కేటాయించి నష్టాల నుండి గట్టెక్కించాలన్నారు. విజ్ఞతతో ఆలోచించకుండా నష్టాలు వస్తా యనే సాకుతో దాదాపు రెండు లక్షల కోట్ల విలువ గలిగిన ప్లాంట్ 30 వేల కోట్లకు కొరియా కంపెనీ చాటున పదానికి కట్టబెట్టా లని మోడీ ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 700 రోజులుగా మోడీ ప్రభుత్వం పునరాలోచన చేయకుండా ప్రభుత్వ ఆదాయాన్ని సమకూర్చి, యువతకు ఉపాధి చూపించే ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారు చౌకగా అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టుతున్నారన్నారు. అందుకోసం ఇటువంటి ప్రజావ్యతిరేక విధానాలకు, ప్రైవే టీకరణకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఇతర ప్రజలను కలుపుకుని ఐక్యంగా ఉద్యమాలు చేసి మోడీకి గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సిఐటియు నాయకులు గోపాలు, సాయిబాబు, అబ్దుల్లా, రాజగోపాలు, ఎఐటియుసి నాయకులు రామాంజనేయులు, ఈశ్వర్, కిట్టు, రాజు, రేణుక, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ పాల్గొన్నారు.

చలో..గళమెత్తేందుకు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉద్యోగులు, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులన్నింటిని మోడీ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తరువాతకాలరాస్తూ కార్మిక చట్టాల్లో మార్పు తెచ్చింది. నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్పొరేట్ కంపెనీల్లో కార్మికులను బానిసలుగా మార్చడానికి పూనుకుంది. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ చేతుల్లో పెడుతోంది. కనీస వేతనాల ప్రస్తావనే చేయడంలేదు. అసంఘటిత కార్మికుల సంక్షేమం ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. స్కీమ్ వర్కర్లతో వెట్టిచాకిరీ చేయిస్తోంది. బిజెపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో కీలక రంగాలైన బ్యాంకులు, ఇన్సురెన్స్, టెలికాం, రైల్వే, పోస్టల్, పోర్టులు, విద్యుత్ సంస్థలతో సహా అన్నింటినీ ప్రైవేటీకరించి స్వదేశ, విదేశీ కంపెనీలకు స్వాధీనం చేయాలని నిర్ణయించింది. ప్రజల సంపద ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి పోతోంది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీం వర్కర్లు శాశ్వతమైన పని పద్ధతుల్లో నిత్యం పనుల్లోనే ఉన్నారు. వీరిని రెగ్యులరైజ్ చేయడం లేదు. ఈ రకంగా ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘా ఆధ్వర్యంలో ఈ నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తేందుకు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లాలో సన్నాహక కార్యక్రమాలు చేపట్టారు. ప్రచార జాతాలు నిర్వహించారు.

మండుతున్న ఎండ : జిల్లాలో ఎండ మండుతోంది. మార్చి చివరి వారానికి భానుడి భగభగలు తీవ్రమయ్యాయి. జిల్లాలో వేసవి తీవ్రత పెరిగింది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమితో మధ్యాహ్నం నిప్పుల కొలిమిలా ఎండ తీవ్రత కనిపిస్తోంది. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు.

జాదూ పరిహారంపై ఆందోళన : కావేరి జాదు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. పత్తి రైతులు తమకు పరిహారం ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ గేట్లను ఎక్కి వాటిని తెరుచుకునేందుకు ప్రయత్నించారు. కొంతసేపు రైతులకు పోలీసులకు మధ్య తోపులాట కొనసాగింది. కలెక్టర్ దిగివచ్చి తమకు న్యాయం చేసేంతవరకు ఈ ఆందోళన విరమించేది లేదని పత్తి రైతులు నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. వెంటనే రైతులను పోలీసులు నిలువరించి జిల్లా అధికారులకు సమాచారాన్ని చేరవేశారు. అక్కడికి వ్యవసాయ శాఖ జెడి వరలక్ష్మి చేరుకొని ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ నుండి వినతి పత్రాన్ని స్వీకరించారు.

అవీ..ఇవీ..అన్నీ.. : కర్నూలు జిజిహెచ్ సెక్యూరిటీ గార్డులకు వేతనాలు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.



గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో నివాళు లర్పించారు. జిల్లా వ్యాప్తంగా టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు.

'మా కుటుంబాలను ఆదుకోండి'

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రధాన ద్వారం పక్కన తోపుడు బండ్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్న పదిమంది కుటుంబాలను ఆదుకోవాలని కమిషనర్ ను శనివారం వినతి పత్రం ద్వారా వేడుకొన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రధాన ద్వారం పక్కన తోపుడు బండ్లు పలహారాలు అమ్ముకుంటూ పది కుటుంబాలు 20 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నామని, 2018లో మాకు షాపులు ఉండరాదని నోటీసులు ఇచ్చారని, తోపుడు బండ్లు పెట్టుకుని జీవనం సాగిస్తూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటున్నామని తెలిపారు. మా కారణంగా ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేవని తెలియజేస్తున్నామన్నారు. శనివారం ఉదయం ఐదు గంటలకు నగరపాలక సంస్థ సిబ్బంది వారు తోపుడుబండ్ల వద్ద గల గుడారాలు అన్నింటిని తొలగించారన్నారు. గేటు వద్ద పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకున్నా మా 10 మంది తోపుడుబండ్లను తొలగించారు. తాము కరెంటు బిల్లులు, ట్రేడ్ లైసెన్సు నగరపాలక సంస్థకు చెల్లిస్తున్నాం మా యందు దయ ఉంచి కోర్టు వారు కూడా అనుమతించి ఉన్నారు. మాకు బండ్లు పెట్టుకొనుటకు అనుమతించాలని కోరారు. అనంతరం మేనేజర్ చిన్నరాముడుకు బాధితులు వెంకట్రాముడు, పుల్లయ్య, నిశ్చితా లక్ష్మీదేవి, రాహల్, సుంకన్న రాఘవేంద్రలు, కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మేనేజరు స్పందిస్తూ మీ విన్నపాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే గఫూర్‌కు పుట్టినరోజు శుభాకంక్షలు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

ఆవాజ్ వ్యవస్థాపకులు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు కర్నూలులోని స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని కర్నూలు జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పత్తికొండ: సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కర్నూల్ మాజీ ఎమ్మెల్యే ఎంఏ. గఫూర్ 71వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు . శనివారం పత్తికొండ పట్టణంలోని రూరల్ ట్రైబల్ డెవలప్‌మెంట్ (ఆర్‌టిడి) సొసైటీ వృద్ధాశ్రమంలో సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర కమిటీ సభ్యులు ఎం ఏ గఫూర్ జన్మదిన వేడుకలను సిపిఎం నాయకులు వృద్ధులతో కలిసి కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఎంఏ గఫూర్ ప్రజల కోసం నిరంతరాయంగా పోరాడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి కొనియాడారు. కర్నూలు నగరానికి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, ప్రస్తుతం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దస్తగిరి, మధుబాబు ప్రజానాట్య మండలి నాయకులు కాశీ విశ్వనాథ్, సిఐటియు మండల అధ్యక్షుడు కాశి విశ్వనాథ్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గిత్తరి రమేష్ , ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు మధు, వాసుదేవ నాయుడు, ఆవాజ్ కమిటీ జిల్లా నాయకులు తాజ్ మహమ్మద్ ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎం.గఫూర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు, అభిమానులు

ముస్లిం మహిళలకు రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న మీసాల సుమలత

ముస్లిం మహిళలకు రంజాన్ కిట్లు పంపిణీ

విశాఖపట్నం ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రంజాన్ నెల పవిత్రమైనదని కటోర ఉపవాస దీక్షలు ఉన్నవారికి సహాయ సహకారాలు అందించాలి అని ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ మహిళా ఐక్యవేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత తెలిపారు. శనివారం కర్నూల్ నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో విశాఖపట్నం ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ ఏర్పాటు చేసిన నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. నగర అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ రోజా వీధిలో ఉన్న పేద ముస్లిం మహిళలకు ప్రతి ఏడాది రంజాన్ నెలలో ఉపవాసం ఉన్నవారికి నిత్యావసర సరుకులను అందించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దయాగుణం, పరోపకారం అనే మానవీయ విలువలు ప్రజలకు అతి ముఖ్యమైనవని సాటి మానవులపై సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇందిరాశాంతి

కెవిఆర్‌లో ఇంటర్నెషిప్ కోర్స్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్న్‌షిప్ కోర్స్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా శాంతి అధ్యక్షత వహించారు. ' ఫ్రెష్ మైండ్ ఈ హబ్' కంపెనీ సిఇఒ ఎస్ఎండి యూసఫ్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ విభాగపు కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శారద వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వీరాచారి, చీఫ్ కోఆర్డినేటర్ ఎల్‌వి శోభారాణి, భౌతిక శాస్త్ర విభాగం నిర్వాహకులు తలత్ పర్వి న్ , వాసవి, డాక్టర్ జి.మహబూబ్ బాష, గిరిజారాణి , డాక్టర్ టి. సునీత, మెంటార్స్ , విద్యార్థులు పాల్గొన్నారు.

మోడీ విధానాలకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : మోడీ నియంతత్వ నిరంకుశ విధానాలు వ్యతిరేకంగా చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టిన విషయాలు ప్రజలకు వివరించడానికి సిఐటియు ఓల్డ్ సిటీ న్యూ సిటీ కమిటీల ఆధ్వర్యంలో సిఐటియు అనుబంధ సంఘాల స్కూటర్ ర్యాలీ నిర్వహించాయి. శనివారం స్కూటర్ ర్యాలీ బళ్లారి చౌరస్తా నుండి సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ జండా ఊపి ప్రారంభించారు. 50 స్కూటర్లతో ప్రారంభమైన ఈ ర్యాలీ కొత్త బస్టాండ్, రాజ్ విహార్ సెంటర్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు కొనిసాగింది. ఈ స్కూటర్ ర్యాలీ నుద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు రాధాకృష్ణ, సిఐటియు నగర కార్య దర్శులు విజయ్, సిహెచ్ సాయి బాబా, ఎం గోపాల్ అబ్దుల్ దేశాయి, కృష్ణ మాట్లా డుతూ దేశంలో ప్రజా స్వామ్యం అత్యంత ప్రమాదంలో ఉందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల హక్కులను హరిస్తున్నారన్నారు. దేశ సంపద సృష్టికర్తలైన రైతులు, కార్మికులు, కూలీలు హక్కులు కార్పొరేట్లకు అనుకూలంగా మోడీ సమూలంగా మార్చి వేస్తున్నాడని తెలిపారు. దీంతో సామాజిక అసమానతలు బిజెపి మోడీ హయాంలో తీవ్రంగా పెరుగుతున్నాయని తెలిపారు. దేశంలోని 40 శాతం సంపద ఒక్క శాతం బడా సంపన్నుల చేతుల్లోకి వెళుతున్న దని అన్నారు. ఈ విధానం అసమానతలు తీవ్రం కావడానికి ప్రజా స్వామ్య విలువలకు సూత్రాలకు ఆటంకం అన్నారు. ఢిల్లీ లో ఈనెల ఐదున రైతులు కూలీలు కార్మిక వర్గం లక్షలాదిమంది జంతర్ మంతర్ వద్ద మోడీ హటావో... దేశ్‌కో బచావో అనే నినాదాలతో ఢిల్లీ దద్దరిల్లుతుందని తెలిపారు. ప్రజలు బిజెపి నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడకపోతే దేశం 100 సంవత్సరాలు వెనక్కి వెళుతుందని ప్రజానీకం గుర్తించాలన్నారు. ఢిల్లీ పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. వృత్తిదారుల సంఘం రాష్ట్ర రాష్ట్ర నాయకులు గురుశేఖర్, ఆటో యూనియన్ నాయకులు కుమార్, మాసూమ్, జి.యేసు తదితరులు నాయకత్వం వహించారు.

బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ

జగనన్న పాలనలో అత్యధిక సంక్షేమం

భవిష్యత్తులో రాష్ట్రానికి పరిశ్రమలు-ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లోని అత్యధిక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు నగరంలోని బి-క్యాంపు అరోరా నగర్ జమ్మి చెట్టు నందు జరిగిన వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, నగర అధ్యక్షురాలు సిట్ర సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లతో కలిసి చెక్కును పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ... గత ప్రభుత్వాల వలే ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని అన్నారు. కార్పొరేటర్లు షైక్ ఆలియా, సీనియర్ నాయకుడు గడ్డం రామకృష్ణ, మొయిన్, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కల్పనా, మెప్మా పిడినాగశివలీల, కన్వీనర్లు, వైసిపి పార్టీ ముఖ్య నాయకులు మెప్మా సిబ్బంది, మహిళలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నగరంలో ఆలయాల అభివద్ధిని వేగవంతం చేయండి

కర్నూలు నగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్ కార్యాలయంలో ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ ని ఎండోమెంట్ డిఇ శ్రీనివాస్ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే నగరంలో ఉన్న శ్రీ రమసహిత సత్యనారాయణ స్వామి దేవాలయము, కోట ఆంజనేయ స్వామి దేవాలయం, రాంబోట్ల టెంపుల్, నాగేశ్వరా స్వామి టెంపుల్, సత్యనారాయణ స్వామి టెంపుల్, అభివద్ధిపై చర్చించారు. ఈ దేవాలయాలకు సిజిఎఫ్ ఫండ్ త్వరగా ఏర్పాటు చేసి దేవాలయాల అభివృద్ధి కార్యక్రమాలు త్వరగా జరిపించాలని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ఎండోమెంట్ అధికారులకు ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఏ.హాఫీజ్‌ఖాన్

యువతతో జగన్ ప్రభుత్వ పతనం : సోమిశెట్టి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పతనానికి నిరుద్యోగ యువతే నాంధీ పలుకనున్నారని కర్నూలు పార్లమెంట్ తెలుగు దేశంపార్టీ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావుయాదవ్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. 2014లో ఆంధ్రరాష్ట్రం విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ కు ఎన్నికలు జరుగగా అప్పుడున్న రాష్ట్ర పరిస్థితులను చక్కెబెట్టే సత్తా ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబునాయుడుని నమ్మి రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించి అధికారంలోకి తెచ్చుకున్నారన్నారు. రాష్ట్రంలోని యువ తకు ఉద్యోగవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో చొరవ చూపారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తెస్తానన్న జగన్‌రెడ్డి ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రానికి తరలివెళ్లేలా చేశారనిన్నారు. నిన్న తెనాలిలో జరిగిన దాడి ప్రజాస్వామ్యమని అనిపించు కోదని అన్నారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి పై వైసి పి వారు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమిశెట్టి నవీన్, నంది మధు, పి రవికుమార్, నాగరాజుయాదవ్, కె చంద్రకాంత్, పి హనుమంతరావు చౌదరి, చంద్రకళాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

విజేతలకు బహుమతులు ఇస్తున్న గ్రామ పెద్దలు

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-సి బెళగల్ : మండలంలోని మారందొడ్డిలో గ్రామపెద్దలు కోడుమూరు వైసిపి ఇంచార్జి కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సారథ్యంలో శ్రీరామనవమి సందర్భంగా శనివారం బండలాగుడు పోటీలను నిర్వహించారు. ముందుగా సర్పంచి కుటుంబం, ఎంపిటిసి కుటుంబం పెద్దలు రాఘవేంద్ర, అంజిలు పోటీలను ఘనంగా ప్రారంభించారు.మొదటి స్థానంలో నిలిచిన పెద్దనేలటూరు సీతారాముడుకు కోట్ల హర్ష రూ 30,000 బహుమతి ఇచ్చారు. రెండో స్థానంలో సంఘాల రాముడు ,పోలకల్ మహేష్ నాయుడు వృషభాలకు రూ.20,000, మూడో స్థానంలో మునగాల అంజినమ్మవి కాగా రూ 15,000, నాల్గో స్థానంలో చెట్నీపల్లి ఈరన్న, కోటకొండ గోపాల్ వి కాగా రూ 10,000, ఐదో స్థానంలో చిల్లమెళ్ల ప్రసాద్‌వి రూ 5000, ఆరో స్థానంలో. గూడూరు దుబ్బన్న వి రూ.3000, ఏడో స్థానంలో కనకవీడు డీలర్ దుబ్బన్న వి రూ 2500, ఎనిమిదో స్థానంలో పెద్దనేలటూరు గోపీచంద్ వి రూ.2000 ఇలా పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామంలో ఆయా రకాల పోటీలను చేపట్టగా ప్రతిభ చూపిన మహిళలకు, బాలికలకు, విద్యార్థులకు బహుమతులిచ్చారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులు

వేతనాలు ఇస్తే కూడా పూట గడవని స్వచ్ఛభారత్ కార్మికులకు దీర్ఘకాలంగా వేతనాలను పెండింగ్‌లో పెట్టడం మంచిది కాదని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, డివిజన్ నాయకులు కెపి.నారాయణస్వామి డిమాండ్ చేశారు. శనివారం చిప్పగిరిలో స్వచ్ఛభారత్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని స్వచ్ఛభారత్ కార్మికులతో వెళ్లి మండల కార్యాలయంలో ఎంపిడిఒ సుధాకర్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించేలా కృషి చేస్తామని హామీఇచ్చారు.

'చలో ఢిల్లీ' గోడపత్రిక విడుదల : చిప్పగిరిలో సిఐటియు డివిజన్ నాయకులు కెపి.నారాయణస్వామి ఆధ్వర్యంలో అంజి బాబు పలు యూనియన్ సంఘాల సభ్యుల సమక్షంలో 'చలో ఢిల్లీ' గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. ప్రధాని మోడీ అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 5న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే మహా ధర్నాకు మండలం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావాలి

- పరీక్షలపై ఆందోళన వద్దు - డిపిఒ నాగరాజు నాయుడు

ప్రజాశక్తి - గోనెగండ్ల

పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డిపిఒ

పదో తరగతి విద్యార్థులు పరీక్షలపై ఆందోళన చెందకుండా ప్రశాంతంగా రాసి ఉత్తీర్ణత సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు తెలిపారు. శనివారం మండలంలోని ఎర్రబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల తరగతి గదులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పరీక్షలు అంటే భయపడి ఆందోళనతో ఒత్తిడికి గురికాకుండా ఉపాధ్యాయుల సూచనలను పాటించాలని తెలిపారు. పరీక్ష సమయం కంటే ముందుగానే కేంద్రానికి చేరుకొని ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

వర్మీ కంపోస్ట్ యూనిట్ తనిఖీ

ఎర్రబాడు పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మీ కంపోస్టు తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి విజయభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

'బటన్ ముఖ్యమంత్రి' పోవాలి

- మాజీ ఎమ్మెల్యే బీవీ - మల్కాపురంలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

'బటన్ ముఖ్యమంత్రి' పోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మల్కాపురం గ్రామంలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. ముందుగా గ్రామంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. టిడిపి వ్యవస్థాపకులు కీర్తిశేషులు ఎన్‌టిఆర్, మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపి హయాంలో గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుటుంబంలో నిరుద్యోగ సమస్య, నిత్యావసర ధరల పెరుగుదల, మద్యపానం, కుంటుపడిన అభివృద్ధి, ఇసుక మాఫియా, తాగునీటి సమస్య, అవినీతి, మహిళల భద్రత, విద్యుత్ సమస్య, రోడ్ల సమస్య, నిధుల దుర్వినియోగం, గిట్టుబాటు ధరలు, నిలకడ లేని పాలన చేస్తున్నారని విమర్శించారు. టిడిపి మండల అధ్యక్షులు పార్లపల్లి మల్లికార్జున, మండల ఉపాధ్యక్షులు బనవాసి అయ్యాలప్ప, మండల నాయకులు చెన్నపురం నాగరాజు, సోగనూరు జగదీష్, సోగనూరు రాఘవేంద్ర,

మాట్లాడుతున్న బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి

'పది' పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం...

- డివిజన్‌లో 79 కేంద్రాలు ఏర్పాటు
- నిమిషం ఆలస్యమైనా 'నో అనుమతి'
- డివిజన్ విద్యాధికారి సుకుమార్

ప్రజాశక్తి - ఆదోని

పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశామని ఆదోని డివిజన్ విద్యాధికారి సుకుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆదోని డివిజన్‌లో 79 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 16,212 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. సమస్యాత్మక కేంద్రాలైన ఆస్పరి, తెర్నేకల్లులో పరీక్షలు సజావుగా జరిగేలా ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి బెంచిపైనే రాసేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సమస్యాత్మకమైన గాజులదిన్నె కేంద్రాన్ని ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఆదోని నియోజకవర్గంలో 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పెద్దహరివాణం, పెద్ద తుంబలం కేంద్రాలతో కలిపి సుమారు 3 వేల మంది పరీక్షకు హాజరవుతారని చెప్పారు. ఈనెల 18 వరకు పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల్లోపు విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి ప్రవేశం లేదని చెప్పారు. ఇన్విజిలేటర్లకు కూడా ఫోన్ అనుమతి ఉండదని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బార్‌కోడ్ సిస్టంలో పరీక్ష పేపర్ ఉంటుందని, 24 పేజీల జవాబు పత్రం ఉంటుందని చెప్పారు. ఎలాంటి అవకతవకలకూ తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో మెళకువలు చెబుతున్న ఉపాధ్యాయులు

భవిష్యత్తుకు తొలిమెట్టు

- అలీమ్ సిద్ధిఖీ, నెహ్రూ మెమోరియల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు

పదో తరగతి పరీక్ష విద్యాపరంగా తొలి మెట్టు లాంటిది. కష్టపడి చదివి మంచిగా పరీక్ష రాసి ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థులు బాటలు వేసుకోవాలి. మా పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, బెంచీలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు ఎలాంటి అనారోగ్య పరిస్థితులకు గురికాకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. సకాలంలో పరీక్షకు హాజరై ప్రతిభను చాటి ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో స్థిరపడాలి.

ప్రశాంతంగా పంచాయతీ వేలాలు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మేజర్ పంచాయతీ పరిధిలోని వివిధ మార్కెట్లకు సర్పంచి అరుణదేవి అధ్యక్షతన శనివారం పోలీసు బందోబస్తు నడుమ వేలం పాటలు ప్రశాంతంగా ముగిశాయి. రెండు సార్లు వేలాలు వేసినా కాంట్రాక్టర్లు ముగ్గురికి మించి హాజరుకాలేదు. మూడో సారి కూడా ఆరుగురికి మించి కాంట్రాక్టర్లు హాజరు కాలేదు. బస్టాండ్ గతేడాది రూ.9.99 లక్షలకు పోగా ఈసారి రూ.7.76 లక్షలకు వెంకట లక్ష్మీ దక్కించుకున్నారు. వారపు సంత మార్కెట్‌ను గతేడాది రూ.4.50 లక్షలకు పాడగా ఈఏడాది రూ.2.60 లక్షలకు నాగరాజు దక్కించుకున్నారు. దినసరి కూరగాయల మార్కెట్‌ను గతేడాది రూ.7.05 లక్షలకు పోగా ఈఏడాది రూ.4.49 లక్షలకు వెంకటలక్ష్మీ దక్కించుకున్నట్లు ఇఒఆర్‌డి ప్రకాష్ నాయుడు, కార్యదర్శి కృష్ణ కుమార్ తెలిపారు. మార్కెట్లు దక్కించుకున్న వారు ఈనెల 8లోపు డబ్బులు మొత్తం చెల్లించనిపోతే మరోసారి వేలం పాటలు వేస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ఆలూరు సిఐ ఈశ్వరయ్య, ఎస్ఐలు విజయ్, మల్లికార్జున బందోబస్తు నిర్వహించారు.

మాట్లాడుతున్న అధికారులు

'పది' పరీక్షలను ప్రశాంతంగా రాయాలి

- పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి - 3 కేంద్రాల్లో పరీక్ష రాసే విద్యార్థులు 474 మంది - ఎంఇఒ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని ఎంఇఒ జె.సుదర్శన్ రెడ్డి తెలిపారు. పదో తరగతి పరీక్షలు నిర్వహించే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నందవరంలోని 3 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 256 మంది, కస్తూర్బా పాఠశాలల్లో 93, ఎంఇఒ కార్యాలయం పక్కన ఉన్న స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో 100 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. ఇందులో 363 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, మిగతా 111 మంది విద్యార్థులు ప్రయివేట్‌గా పరీక్షలు రాస్తున్నారన్నారు. ఎలాంటి అవకతవకలూ జరగకుండా, మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పదో తరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసుతులన్నీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మూడు కేంద్రాల్లో ఎస్ఐ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ప్రజలు ఎవరూ కేంద్రాల దగ్గరకు రాకూడదని, వస్తే పోలీసులు కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. చీఫ్ సూపరింటెండెంట్లు నాగభూషణ్ రెడ్డి, దేవకృపమ్మ, శ్రీనివాసులు, డిపార్ట్‌మెంటల్ అధికారులు కాశయ్య, నాగరాజు, హరిప్రసాద్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్‌టి.రామకృష్ణ, కెజిబివి ప్రిన్సిపల్ శైలజ, ఇన్విజిలేటర్లు నరసప్ప, మాణిక్యం, నరసన్న, నాగరాజు, నరసింహులు, హనుమంతు, సురేంద్ర, రామదాసు, శ్రీనివాసులు, ప్రేమ జ్యోతి, రామలింగమ్మ పాల్గొన్నారు.

పరీక్ష ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎంఇఒ

బాబు, పవన్‌ను నమ్మితే మోసపోవడం ఖాయం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి - లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ కష్ట కాలంలో సైతం ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కాదని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌ను నమ్మితే ప్రజలు మోసపోవడం ఖాయమని ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ గ్రౌండ్‌లో పట్టణంలోని 31 వార్డులకు చెందిన పొదుపు గ్రూపులకు మంజూరైన వైఎస్ఆర్ ఆసరా రూ.15.70 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలను లక్షాధికారులను చేయడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయమని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత నాడు ఎన్‌టి.రామారావుకు, నేడు జగన్మోహన్ రెడ్డికి దక్కిందని చెప్పారు. రాష్ట్రంలో ప్రజల కోసం పార్టీ పెట్టి అధికారంలోకి వచ్చింది ఎన్‌టిఆర్, జగన్మోహన్ రెడ్డిలు మాత్రమేనని తెలిపారు. చంద్రబాబు ఎన్‌టిఆర్‌ను వెన్నుపోటు పొడిచి పార్టీని, పదవిని దక్కించుకున్నారని విమర్శించారు. 14 ఏళ్ల పాటు పదవిలో ఉన్నా రాష్ట్రానికి చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. అధికారం కోసం పవన్‌ను వెంటబెట్టుకుని వస్తున్నారని, చంద్రబాబు కేవలం లోకేష్‌ను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గాల్లో విజయం సాధించడంతో రాష్ట్రంలో టిడిపి విజయం సాధించినట్లు చంద్రబాబు భావిస్తున్నారని చెప్పారు. 2024 ఎన్నికల్లో వైసిపి విజయం సాధించడం ఖాయమని, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఉంటారని తెలిపారు. ఆదోని అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారని, త్వరలోనే అన్ని పనులూ చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, స్టేట్ డైరెక్టర్ రేణుక, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, కౌన్సిలర్లు బాలాజీ, ఫయాజ్, లక్ష్మీదేవి, మధుసూదన్ శర్మ, చంద్రశేఖర్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, మాధవరెడ్డి, వీరభద్ర రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, తాయన్న, సంజీవ్, మల్లికార్జున, కృష్ణవేణి, మల్లికార్జున, మజార్, భాస్కర్, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, మెప్మా సిఒ వీరారెడ్డి, జావీద్, సమీనా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దేవనకొండలో తాగునీటి ఎద్దడి

- సక్రమంగా సరఫరా చేయని సిబ్బంది

- దాహంతో అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో గత వారం రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొనడంతో పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి బండ గట్టు రిజర్వాయర్ నుంచి తాగునీరు సరఫరా అవుతోంది. పంచాయతీ వాటర్ సిబ్బంది కుళాయిలకు నీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. ఏ సమయంలో నీటిని వదులుతున్నారో అర్థంకాని పరిస్థితి ఉందని మాల వీధి కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ కొన్ని కాలనీలకు మాత్రమే ఆ నీరు సరఫరా అవుతోందని, కొన్ని కాలనీలకు మాత్రం బండ గట్టు నీరు వస్తేనే తాగునీటిని కుళాయిలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. అది కూడా సంబంధిత వాటర్ పంపింగ్ సిబ్బంది సక్రమంగా అందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా బండగట్టు తాగునీటిని సక్రమంగా పంపిణీ చేసేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

3 నుంచి పదో తరగతి పరీక్షలు

- విద్యార్థులు సకాలంలో కేంద్రానికి చేరుకోవాలి - ఎంఇఒ ఈరన్న

ప్రజాశక్తి - హొళగుంద

ఈనెల 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఎంఇఒ ఈరన్న సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఎ' కేంద్రంలో 165 మంది, 'బి' కేంద్రంలో 165 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. కెజిబివిలో 45 మంది, స్థానిక కన్నడ పాఠశాలలో 110 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. నలుగురు ఎగ్జామ్ చీఫ్‌లు, నలుగురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు ఉంటారని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు కాకుండా చూసుకోవాలన్నారు.

పథకం ప్రకారమే రాహుల్ గాంధీపై అనర్హత వేటు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నీలకంఠప్ప

ప్రజాశక్తి - ఆదోని

రాబోయే రోజుల్లో బిజెపి ఓటమి తప్పదనే భయంతోనే రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.నీలకంఠప్ప విమర్శించారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమని తెలిపారు. సూరత్ కోర్టులో రెండేళ్లు శిక్ష విధించిన 24 గంటల్లోపే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం తొలగించడం కక్ష సాధింపు చర్యగా భావిస్తున్నామని చెప్పారు. రాహుల్ గాంధీ వెనుక యువత ఉందని, ఎంతవరకైనా పోరాడి అండగా నిలుస్తుందని తెలిపారు. ఆదోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వై.సాయినాథ్ పాల్గొన్నారు.

ఆర్‌బికె యూట్యూబ్ ఛానెల్ సమయ పట్టిక విడుదల

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఈనెలలో ఆర్‌బికె యూట్యూబ్ ఛానెల్‌లో ప్రారంభమయ్యే కార్యక్రమాల సమయ పట్టికను ఎఒ వరప్రసాద్ శనివారం విడుదల చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత రెండేళ్ల నుంచి శాస్త్రవేత్తలతో విశ్లేషించి రైతులకు ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలు ఆర్‌బికె యూట్యూబ్ ఛానెల్‌లో ప్రసారమవుతున్నాయని తెలిపారు. ఈ నెల నుంచి వాటిని సమయ పట్టిక ద్వారా రైతులకు ముందస్తు సమాచారం ఇస్తామని చెప్పారు. సమయపట్టికను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఆర్‌బికె యూట్యూబ్ ఛానెల్‌లో వ్యవసాయ సంబంధమే కాకుండా ఉద్యాన, పట్టు పరిశ్రమ, పాడి రైతులకు ఉపయోగపడే విధంగా ఉంటాయని చెప్పారు. ఎంపిఇఒ శ్వేత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు మృతి

ప్రజాశక్తి - హొళగుంద

రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు కోలుకోలేక శనివారం మృతి చెందారు. హొళగుంద గ్రామానికి చెందిన రైతు కెసి.సిద్ధయ్య శుక్రవారం మండలంలోని హెబ్బటం, లింగంపల్లి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం బళ్లారికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. రైతు పండించిన వేరుశనగ పంటను అమ్మడానికి ఆదోని మార్కెట్‌కు వెళ్లి తిరుగు వస్తుండగా రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితతో సరసాలకు పాల్పడిన పోలీసుపై చర్యలు

ప్రజాశక్తి-ఆలూరు

'ఖాకీ సరసాలు' శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ శనివారం విచారణ చేపట్టి వివాహితతో ప్రేమాయణం కొనసాగించిన పోలీసు రవిపై చర్యలు తీసుకున్నారు. ఆయనను విఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. పోలీసు ప్రేమాయణంపై వచ్చిన వార్త డివిజన్‌లో చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సస్పెన్షన్

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సింహాద్రిని సస్పెన్షన్ చేసినట్లు శనివారం సిసిఇ పి.భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపల్ సింహాద్రి కళాశాల కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను తొలగించి మూలన వేసి అవమానించారని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు, ఫిర్యాదుకు స్పందించారు. కమిషనర్ ఆఫ్ కళాశాల ఎడ్యుకేషన్ (సిసిఇ) పి.భాస్కర్ సస్పెన్షన్ విధించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సింహాద్రిని సస్పెన్షన్ చేయాలని ఫిబ్రవరి 6న తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ధర్నాకు స్పందించిన తహశీల్దార్, ఎంఇఒ డిగ్రీ కళాశాలకు వెళ్లి తొలగించిన స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, మహాత్మ గాంధీ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్, సర్వేపల్లి రాధాకృష్ణన్, స్వామి వివేకానంద, నెహ్రూ చిత్రపటాలను తొలగించిన చోటనే తిరిగి పెట్టారని చెప్పారు. తొలగించిన విషయంపై, గణతంత్ర దినోత్సవం రోజు హాజరు కానీ విషయంపై వివరణ కోరగా వారి పట్ల నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిన విషయాన్ని ఎపి సిసిఇ పి.భాస్కర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన కమిషనర్ మార్చి 29న ప్రభుత్వ డిగ్రీ ప్రిన్సిపల్ సింహాద్రిని సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు.

తొలగించిన చిత్రపటాలను పెడుతున్న తహశీల్దార్, ఎంఇఒ

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని చెల్లెల చెలిమల గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు శనివారం పరిశీలించారు. చెత్త సంపద పనితీరు, పొడి, తడి చెత్తను వేర్వేరుగా ప్రాసెసింగ్ చేస్తున్నారా లేదా అని సర్పంచి చిన్న రామప్పను అడిగి తెలుసుకున్నారు. చెత్త సంపద తయారీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను, సిబ్బంది పని తీరును పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ఇఒఆర్‌డి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు శివశంకర్ సింగ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న డిపిఒ

వేలం పాట ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం : సర్పంచి

ప్రజాశక్తి - మంత్రాలయం

వేలం పాట ద్వారా పంచాయతీకి రూ.50,800 ఆదాయం అధికంగా వచ్చినట్లు సర్పంచి తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. శనివారం మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపిడిఒ ప్రభావతి, ఎస్ఐ వేణుగోపాల్ రాజ్, కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. వారపు సంత మార్కెట్ రూ.42 వేలకు రాంపోగు ఆనక్, దినసరి మార్కెట్ రూ.81 వేలకు ఎం.నర్సయ్య కైవసం చేసుకున్నారు. ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచి భీమయ్య

బండలాగుడు పోటీల విజేత గడేకల్

ప్రజాశక్తి - చిప్పగిరి

శ్రీరామనవమి పండగ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నేమకల్లు గ్రామంలో నిర్వహించిన పోటీల్లో గడేకల్ విజేతగా నిలిచింది. శనివారం సర్పంచి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో రసవత్తరంగా సాగిన బండలాగుడు పోటీల్లో గడేకల్ గ్రామానికి చెందిన వేణుగోపాల్ యాదవ్ వృషభాలు విజేతగా నిలిచాయి. ఈ పోటీలను వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, ఎంపిపి భర్త, వైసిపి యువ నాయకులు జూటూరు మారయ్య, దేగలపాడు ప్రకాష్ రెడ్డి టెంకాయ కొట్టి ప్రారంభించారు. విజేత గడేకల్ వృషభాలకు వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ రూ.30 వేల బహుమతిని అందజేశారు. ద్వితీయ బహుమతి పెంచలపాడు భీమలింగ వృషభాలకు దేగలపాడు ప్రకాష్ రెడ్డి రూ.25 వేలు అందజేశారు. మూడో బహుమతి ఆత్మకూరు రవిచంద్ర వృషభాలకు వైసిపి యువ నాయకులు జూటూరు మారయ్య రూ.20 వేలు అందజేశారు. నాలుగో బహుమతి దాసులోడికి వృషభాలకు బంగారు షాపు సత్తన్న దేవక్క గారి ప్రతాప్ రూ.15 వేలు అందజేశారు. 5, 6 బహుమతులను నగరడోనా నాగేంద్ర, గిరి రూ.9 వేలు అందజేశారు. 7, 8 బహుమతులను లక్ష్మి కాంత్ రెడ్డి, ప్రభాకర్ రూ.8 వేలు అందజేశారు. అనంతరం సర్పంచి ప్రేమ్ కుమార్ మాట్లాడారు. అన్నదానానికి సహకరించిన దేవక్క గారి జయన్న, డాక్టర్ వీరాంజనేయులు, మేకల లక్ష్మణస్వామి, పోటీలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాదికి రూ.50 వేలు ఇస్తానని ప్రకటించిన వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న నాయకులు

వాల్మీకులను మభ్యపెడుతున్న ప్రభుత్వం

- టిడిపి జిల్లా కార్యదర్శి ప్రభాకర్ నాయుడు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మాట్లాడుతున్న ప్రభాకర్ నాయుడు

వైసిపి ప్రభుత్వం వాల్మీకులను మభ్య పెడుతోందని టిడిపి జిల్లా కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, మాజీ సర్పంచి రంగముని, బోయ కౌలుట్లయ్య నాయుడు, చెన్నెల రాయుడు విమర్శించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు నాలుగు జిల్లాలకు మాత్రమే వర్తించేలా తీర్మానం చేసి కేంద్రానికి పంపడం సరికాదన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఉన్న వాల్మీకులందరినీ ఎస్టీ జాబితాలో చేర్చాలని అప్పుడే కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం చేసి పంపారని గుర్తు చేశారు. ఇప్పుడు రాయలసీమకే పరిమితం చేయడం వాల్మీకుల మధ్య ప్రాంతీయ అసమానతలు రేపడమే అన్నారు. ఈనెల 2న తలపెట్టిన ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం, ర్యాలీని వాల్మీకులు బహిష్కరించాలని కోరారు. గంజిహళ్లి పెద్ద లక్ష్మన్న, సత్య నారాయణ పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎస్ఒ పద్మావతి

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఒ పద్మావతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడారు. 6వ తరగతిలో 60 సీట్లు, 11వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అలాగే 7, 8, 9వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పంపించాలని తెలిపారు.

ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు దగ్ధం

- రూ.లక్ష మేర నష్టం - రైతును ఆదుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండలంలోని నేమకల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... రైతు ఎర్రప్ప స్వామికి చెందిన రెండు గడ్డి వాములు ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి కాలిబూడిదయ్యాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఎంపిపి హేమలత భర్త జూటూరు మారయ్య హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రైతును ఆదుకోవాలని స్థానికులు కోరారు. ప్రభుత్వ అధికారులకు తెలిపి వెంటనే నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తామని మారయ్య హామీఇచ్చారు.

రాఘవేంద్రుని సన్నిధిలో బసవరాజ్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి బసవరాజ్ దర్శించుకున్నారు. శనివారం దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులను కలిసి శాలువాతో సన్మానించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు కూడా ఆయనను కుశల ప్రశ్నలు వేసి మెమొంటో అందజేసి ఆశీర్వదించారు.

3 నుండి ఒంటిపూట బడులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 3 నుంచి ఒంటి పూట బడులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని డిఇఒ అనురాధ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఒంటిపూట బడులు నిర్వహించాలని పేర్కొన్నారు. సాధారణంగా మార్చి నెల రెండో వారంలో ఒంటి పూట బడులు ప్రారంభమయ్యేవి. ఉపాధ్యాయులపై ప్రభుత్వానికి కోపమో ఏమోగానీ మార్చి నెలలో అనుమతి ఇవ్వలేదు. ఎండలు విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా ఈ నెల 3 నుంచి ఒంటి పూట బడులకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటూ జీవో విడుదల చేసింది.

చలో.. గళమెత్తేందుకు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉద్యోగులు, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులన్నింటిని మోడీ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తరువాత కాలరాస్తూ కార్మిక చట్టాల్లో మార్పు తెచ్చింది. నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్పొరేట్ కంపెనీల్లో కార్మికులను బానిసలుగా మార్చడానికి పూనుకుంది. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ చేతుల్లో పెడుతోంది. కనీస వేతనాల ప్రస్తావనే చేయడంలేదు. అసంఘటిత కార్మికుల సంక్షేమం ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. స్కీమ్ వర్కర్లతో వెట్టిచాకిరీ చేయిస్తోంది. బిజెపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో కీలక రంగాలైన బ్యాంకులు, ఇన్సురెన్స్, టెలికాం, రైల్వే, పోస్టల్, పోర్టులు, విద్యుత్ సంస్థలతో సహా అన్నింటినీ ప్రైవేటీకరించి స్వదేశ, విదేశీ కంపెనీలకు స్వాధీనం చేయాలని నిర్ణయించింది. ప్రజల సంపద ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి పోతోంది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీం వర్కర్లు శాశ్వతమైన పని పద్ధతుల్లో నిత్యం పనుల్లోనే ఉన్నారు. వీరిని రెగ్యులరైజ్ చేయడం లేదు. ఈ రకంగా ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘా ఆధ్వర్యంలో ఈ నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తేందుకు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లాలో సన్నాహక కార్యక్రమాలు చేపట్టారు. ప్రచార జాతాలు నిర్వహించారు.

మండుతున్న ఎండ : జిల్లాలో ఎండ మండుతోంది. మార్చి చివరి వారానికి భానుడి భగభగలు తీవ్రమయ్యాయి. జిల్లాలో వేసవి తీవ్రత పెరిగింది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమితో మధ్యాహ్నం నిప్పుల కొలిమిలా ఎండ తీవ్రత కనిపిస్తోంది. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు.

జాదూ పరిహారంపై ఆందోళన : కావేరి జాదు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. పత్తి రైతులు తమకు పరిహారం ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ గేట్లను ఎక్కి వాటిని తెరుచుకునేందుకు ప్రయత్నించారు. కొంతసేపు రైతులకు పోలీసులకు మధ్య తోపులాట కొనసాగింది. కలెక్టర్ దిగివచ్చి తమకు న్యాయం చేసేంతవరకు ఈ ఆందోళన విరమించేది లేదని పత్తి రైతులు నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. వెంటనే రైతులను పోలీసులు నిలువరించి జిల్లా అధికారులకు సమాచారాన్ని చేరవేశారు. అక్కడికి వ్యవసాయ శాఖ జెడి వరలక్ష్మి చేరుకొని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ నుండి వినతి పత్రాన్ని స్వీకరించారు.

అవీ..ఇవీ..అన్నీ..

గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు.

నిరంతరం సేవా కార్యక్రమాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా నంద్యాల ప్రజలకు శిల్పా సేవా సమితి ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ఆధ్వర్యంలో 136 మంది మహిళలకు 16 లక్షల 46 వేల రూపాయల రుణాలకు సంబంధించి చెక్కులను బ్యాంక్ చైర్పర్సన్ నాగిని రవి సింగారెడ్డి, ఎమ్మెల్యే చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. అలాగే గత 6నెలలుగా శిల్పా స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శిల్పా కుటుంబం నంద్యాల ప్రజలకు నిస్వార్థంగా సేవలందించేందుకు శిల్పా సేవ సమితి స్థాపించి చేసి నేటి వరకు నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. రాజకీయాల్లోకి సంపాదన కోసం రాలేదని, కేవలం సేవ చేయడానికి వచ్చామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రుణాలు పొందిన మహిళలు సకాలంలో తిరిగి చెల్లించి మరింత మందికి చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హాలీల, మహిళలు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

ఈకెవైసి నమోదుకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈకెవైసి నమోదుకు ఈ నెల 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి టీ మోహన్ రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-23 రబీకి సంబంధించి జిల్లాలో 4.08 లక్షల ఎకరాలకు గాను 3.94 లక్షల ఎకరాలకు ఈకెవైసి రైతులతో చేయించినట్లు తెలిపారు. మిగిలిన 3.47 శాతం రైతులకు కూడా ఈకేవైసి చేయించటం కోసం ఈ నెల 10వ తేదీ వరకు గడువు పెంచినట్లు పేర్కొన్నారు. కావున మిగిలిన ఉయ్యాలవాడ 1066 మంది రైతులు, కోవెలకుంట్ల 867 మంది, సంజామల 581 మంది, బండి ఆత్మకూరు 760 మంది, దొర్నిపాడు 266, మిడ్తూర్ 415, నంద్యాల 271 మంది రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రంలోని విఏఏ, విహెచ్ఏని కలసి ఈకేవైసి చేయించుకోవాలన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, యూనిట్ హెడ్ ధనలక్ష్మి, ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పివి. ప్రతాప్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్కిల్ హబ్ అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఇంటర్ ఆపైన చదివిన వారు అర్హులని, వివరాలకు 9705998056 నెంబర్ సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఆరుగురికి గాయాలు
- శ్రీశైలం ఘాట్‌లో అదుపు తప్పి డివైడర్‌ను, స్కూటీని ఢీకొట్టిన బొలెరో

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం ఘాట్ రోడ్‌లో శనివారం బొలెరో, స్కూటీ వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మాచర్ల నుండి శ్రీశైలం వస్తున్న బొలెరో వాహనంలో ఏడు మంది ప్రయాణికులు ఉన్నారు. అతివేగంగా వస్తున్న బొలెరో వాహనం శ్రీశైలం శిఖరం దాటిన తర్వాత మూడు కిలోమీటర్ల దూరంలో అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. డ్రైవర్ వెంకటేష్(35)కు ఇనుప రాడ్డు గుచ్చుకోవడంతో వాహనంలోనే మృతి చెందాడు. అనంతరం బొలెరో వాహనం ఎదురుగా శ్రీశైలం నుంచి దోర్నాలకు వెళ్తున్న స్కూటీపై వస్తున్న శివ నాగ ప్రసాద్(45)ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో శివ నాగప్రసాద్ వాహనంపై నుంచి ఎగిరి చెట్ల పొదల్లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. శివ నాగ ప్రసాద్ శ్రీశైల దేవస్థానంలోని స్వామివారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే బొలెరో వాహనంలో మిగిలిన 6 మందికి గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని శ్రీశైలం ప్రాజెక్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దోర్నాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బోల్తా పడిన బొలెరో వాహనం

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వైబి.శ్రీధర్ రెడ్డి

గృహాలను పరిశీలిస్తున్న డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వైబి.శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూరు

జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ వైబి.శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మిడుతూరు మండలంలోని చింతలపల్లె సచివాలయ పరిధిలోని ఖాజీ పేట జగనన్న గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అనంతరం నాడు-నేడు పథకం కింద చేపడుతున్న చింతలపల్లె ఎంపీపీ స్పెషల్ స్కూల్‌ను పరిశీలించి, తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జిఎన్. రెడ్డి, ఎపిఎం సుబ్బయ్య, హౌసింగ్ ఏఈ రమేష్, తదితరులు ఉన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలను ఎస్ఇ పరిశీలన

చాగలమర్రి : మండలంలో జగనన్న లే అవుట్లలో పూర్తైన గృహ నిర్మాణాలను పంచాయతీ రాజ్ నంద్యాల జిల్లా ఎస్ఈ రామ్మోహన్ శనివారం పరిశీలించారు. మండలంలోని పెద్దబోధనం, మద్దూరు, తోడేంళ్లపల్లె, చాగలమర్రి గ్రామాల్లో నిర్మాణాలు పూర్తైన గృహాలను పరిశీలించారు. అనంతరం కాలనీలో విద్యుత్, నీటి సౌకర్యం ఉందా లేదా అని తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చాగలమర్రిలోని మూడు లేఅవుట్లలో 66, పెద్దబోధనం 21, మద్దూరు 6, తోడేంళ్లపల్లె 17గృహాలు పూర్తయ్యాయని వివరించారు. అనంతరం చాగలమర్రిలోని కస్తూర్బా, ప్రధాన ప్రాథమిక పాఠశాల, తోడేంళ్లపల్లె పాఠశాలల్లో నాడు నేడు పనులు, మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిఈ లక్ష్మి నరసింహులు, తహసీల్దారు విజయ్ కుమార్, ఎంపీడీవో భాగలక్ష్మి, ఈవోపీఆర్డీ నాగేంద్రయ్య, ఏఈలు షఫివుల్లా,కొండారెడ్డి, ఈవో సుదర్శన్రావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఆదివారం
ఇఫ్తార్ : 6 : 36

సోమవారం
సహేరి : 4 : 50

ఎస్ఎస్‌సి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

ప్రజాశక్తి - కోయిలకుంట్ల

పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినట్లు కోయిలకుంట్ల డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కోయిలకుంట్ల డిపో పరిధిలోని పలు గ్రామాల నుంచి పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఆర్టీసీ బస్సులో ఒరిజినల్ హాల్ టికెట్ చూపించి ఉచిత ప్రయాణం పొందాలన్నారు. ఈ నెల 3 నుండి 18వ తేదీ వరకు పరీక్షలు ఉన్న రోజుల్లో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - సంజామల

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపిపి పోచ రమాదేవి అన్నారు. శనివారం స్త్రీశక్తి భవనంలో పౌష్టిక వారోత్సవాల సందర్భంగా చిరుధాన్యాల స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ్ కుమార్ రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, సర్పంచి, డాక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

వాసాపురం వెంకటేశ్వర స్వామికి విశేష పూజలు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం సమీపంలో వెలిసిన వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఘనంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామికి కుంకుమార్చన నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు దాతలు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సింగతల మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం వెంకట రంగనాయకులు శెట్టి, కోశాధికారి కానాల ఈడిగ నరసింహులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న భక్తులు

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

ప్రజాశక్తి - బనగానపల్లె

అనారోగ్యంతో బాధపడుతున్న ఎనిమిది మందికి ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు టంగుటూరి శీనయ్య ఆర్థికసాయం అందజేశారు. శనివారం పట్టణంలోని టంగుటూరి శీనయ్య కార్యాలయంలో వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు ఆర్థిక సహకారంతో పట్టణానికి చెందిన, చుట్టుపక్కల గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న 8 మందికి రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వసుధ ఫౌండేషన్ తరపున విద్యార్థులకు పుస్తకాలు, ఉపకార వేతనాలు పంపిణీ చేశామని, కరోనా సమయంలో ఎనిమిది మందికి ఆర్థికసాయం అందించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఫౌండేషన్ సహకారంతో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు శివచంద్రయ్య, మండల అధ్యక్షులు నాగేంద్ర కుమార్, ప్రపంచ ఆర్యవైశ్య సంఘం మహాసభ సెక్రటరీ భరతుడు, నాయకులు కాసుల జంగం శెట్టి, బిగుమల్ల సుబ్రహ్మణ్యం, రిటైర్డ్ హెచ్ఎం పక్కిరరెడ్డి, టీచర్ నాగరాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు మల్లారెడ్డి, ఆకుమళ్ల పక్కిరరెడ్డి, ఆర్‌సి నాగిరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం చేస్తున్న టంగుటూరి శీనయ్య

మౌలిక వసతులు కల్పించాలి : సిపిఐ

ప్రజాశక్తి - గోస్పాడు

గోస్పాడు మండలంలోని పలు గ్రామాలలో వైయస్సార్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ మండల కార్యదర్శి హరినాథ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నీరు, సిసి రోడ్లు, విద్యుత్ తదితర సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇల్లు నిర్మించుకోవాలనే వారు తగిన సౌకర్యాలు లేకపోవడంతో నిర్మాణాలు చేపట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మండల సహాయ కార్యదర్శులు జిలాని భాషా, గోకారి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

రానున్న ఎన్నికల్లో వైసిపి జెండా ఎగరాలి

- మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి జెండా ఎగరాలని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆళ్లగడ్డ నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లు, సచివాలయ ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లు, సచివాలయ ఇన్చార్జిలు అందరూ కలిసి నియోజకవర్గంలో ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నారు. వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి ప్రతి ఒక్కరు సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో విజయ మిల్క్ డైరీ డైరెక్టర్ గంగుల విజయ సింహా రెడ్డి, ఆళ్లగడ్డ ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, స్టేట్ ముస్లిం మైనార్టీ జనరల్ సెక్రటరీ బాబులాల్, ఆళ్లగడ్డ కన్వీనర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, ఎంపిపిలు వీరభద్రుడు, అమర్నాథ్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవ రెడ్డి, ఉయ్యాలవాడ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, చాగలమర్రి మండల కన్వీనర్ కుమార్ రెడ్డితో పాటు సచివాలయ ఇంచార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పాణ్యం :** సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. పాణ్యంలో జరిగిన గృహ సారథులు, సచివాలయం కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి హుస్సేన్ బీ, వైసిపి నాయకులు సూర్య నారాయణ రెడ్డి, పాలెం చంద్ర శేఖర్ రెడ్డి, చందమామ బాబు, సర్పంచులు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి

పాణ్యం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కళాకారులను సన్మానిస్తున్న బ్రహ్మానంద ఆచారి

కళాకారులను ప్రోత్సహిద్దాం

ప్రజాశక్తి - బనగానపల్లె

కళాకారులను ప్రోత్సహిద్దామని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలుకూరు గ్రామంలో బీరప్ప స్వామి దేవాలయంలో జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి ఆధ్వర్యంలో బీరప్ప స్వామి డోలు వాయిద్యం నేర్పించిన గురువు జంగిటి మద్దిలేటికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులను, గురువు మద్దిలేటిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీరప్ప స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న కురువ కులస్తులను అభినందిం చారు. సన్మాన గ్రహీత మద్దిలేటి మాట్లాడుతూ తనను సన్మానించిన బ్రహ్మానంద ఆచారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు సుబ్బరాయుడు, మహేష్, గాలేన్న, కురువ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములకు చల్లా శ్రీలక్ష్మీ ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - అవుకు.

పట్టణంలోని ముస్లిం సోదరులకు అవుకు జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి ఇఫ్తార్ విందును శనివారం ఇచ్చారు. మసీదు వద్ద ముస్లిం సోదరులకు దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి పేరు మీద ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. చల్లా భగీరథ రెడ్డి మన మధ్య లేకపోయినా, ఆయన ప్రజల కోసం తపన పడే వ్యక్తి అని, అందుకే ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా సాయి చరణ్ రెడ్డి, చల్లా సాయి చైతన్య రెడ్డి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందును ఇస్తున్న జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి

ఆలయ చరిత్రను వివరిస్తున్న పురోహితులు

సంగమేశ్వరంలో తెలంగాణ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - కొత్తపల్లి

సప్తనదుల సంగమ తీరంలో వెలసిన సంగమేశ్వర క్షేత్రంలో తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సాంబ శివ నాయుడు దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ పూర్ణకుంభంతో చీఫ్ జస్టిస్ దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం సంగమేశ్వర ఆలయంలో ఉన్న వేపదారు శివలిం గానికి పూజలు నిర్వహించారు. అలాగే పురోహితులు జడ్జికి ఆలయ విశిష్టత వివరించారు.

ప్రాతకోట గ్రామ పంచాయతీకి పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి - పగిడ్యాల

బండి మెట్ట సంత మార్కెట్ వేలంపాటలో ప్రాతకొట గ్రామ పంచాయతీకి ఆదాయం పెరిగిందని ఎంపిడిఒ వెంకటరమణ, ఇఒఆర్‌డి పుల్లయ్య తెలిపారు. శనివారం ప్రాతకొట గ్రామంలోని సంత మార్కెట్‌లో మండి మెట్ట, సంత మార్కెట్ సర్పంచు పిట్టల శేషమ్మ ఆధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంత మార్కెట్, బండి మెట్ట రెండిటికి కల్పి ప్రభుత్వం రూ 98366 నిర్ణయించిందన్నారు. సంత మార్కెట్ రూ 89 వేలకు ఉశేన్‌బాష వేలం పాటను కైవసం చేసుకున్నారు. బండి మెట్ట రూ 67 వేలు మిద్దె మోక్షం వేలంపాటను కైవసం చేసుకున్నారు. గ్రామ పంచాయతీకి ఆదాయం పెరిగిందని వారు తెలిపారు. ఎటువంటి అవంచానియ సంఘటణలు జరుగకుండా ముచ్చుమర్రి ఎస్ఐ నాగర్జున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సమతయశోదర , కోఆప్షన్ సభ్యులు అస్లంబాష, వైస్ ఎంపిపి శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామికి రూ.6.04 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి స్వామి వారి భక్తుల ద్వారా శనివారం రూ.6.04 లక్షలు ఆదాయం చేకూరినట్లు ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. స్వామివారి దర్శనం కోసం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు వచ్చారని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా డోన్ పట్టడానికి చెందిన రామ మద్దయ్య అనే భక్తుడు స్వామివారి ఆలయ పునర్నిర్మాణం కోసం 60 వేల రూపాయల విరాళంగా ఇచ్చారని, స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు కోవిడ్-19 నిబంధనలను పాటించే విధంగా భక్తులకు సూచించినట్లు ఈవో తెలిపారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రేపు నుండి ప్రారంభం

ప్రజాశక్తి - పగిడ్యాల : పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రం పగిడ్యాలలో రెండు పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని 419 మంది విద్యార్థిని విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హజరు కానున్నారు. పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 39 మంది, నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 52 మంది విద్యార్థులు, ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 30 మంది, ప్రాతకొట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 83, మోడల్ స్కూల్ 97 మంది, కస్తూర్బా పాఠశాల 39 మంది, గురుకుల బాలికల పాఠశాల నుండి 79 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అని వసతులు ఏర్పాట్లు చేశారు. డెస్కులు, విద్యుత్ సౌకర్యం, మంచి నీటి సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేశారు. **బేతంచెర్ల :** మండలంలో ఆరు పదవ తరగతి పరీక్ష కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ

పగిడ్యాల పరీక్ష కేంద్రం

సోమశేఖర్ శనివారం తెలిపారు. మూడవ తేదీన ఉదయం 8 గంటల 30 నిమిషాల లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మాస్ కాపింగ్‌కు తావు లేకుండా విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. **చాగలమర్రి:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని ఎంఇఒ అనురాధ పేర్కొన్నారు. శనివారం చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్లు, జిల్లా డిపార్ట్మెంటల్ అధికారి చీఫ్ సూపరెండెంట్ అధికారులతో ఆమె సమావేశం అయ్యారు. ఈనెల 3వ తేదీ నుండి చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, సెంట్‌ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు లో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం చీఫ్ సూపరెంట్ అధికారి, ప్రధానోపాధ్యాయులు కోటయ్య, డిపార్ట్మెంటల్ అధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రెండు విలేకరులతో మాట్లాడుతున్న జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- చల్లా శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - అవుకు

తనపై భౌతికంగా దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని జడ్పిటిసి శ్రీలక్ష్మి విజ్ఞప్తి చేశారు. శనివారం చల్లా శ్రీ లక్ష్మి పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన భద్రత కోసం సెక్యూరిటీని ఏర్పాటు చేసినా తన కార్యాలయంలోకి వచ్చి తనపై దాడి జరగడం మహిళా లోకానికి అవమానమని అన్నారు. దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి, కోడలిగా, దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి భార్యపైనే భౌతికంగా దాడులు చేయటంపై తీవ్ర ఆవేదనకు గురి చేస్తుందని అన్నారు. తనపై దాడి జరుగుతున్న దృశ్యాలు వీడియో ఫుటేజ్‌లు ఉన్నప్పటికీ కూడా దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకోలేదని అన్నారు. గతంలోనూ తనపై నాలుగుసార్లు దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పిటిసి సభ్యురాలిపైనే దాడులు జరిగితే గ్రామంలోని మహిళలు, కార్యకర్తలకు రక్షణ ఏ విధంగా ఉంటుందని ఆమె వాపోయారు. తనపై దాడి చేసిన దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, లలితమ్మ, చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, పృథ్వి రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలి

- గిరిజన సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేలా శాసనసభలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గిరిజన ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ నేతత్వంలో శనివారం స్థానిక మున్సిపల్ ఆఫీస్ నుండి శ్రీనివాస సెంటర్ వరకు గిరిజనులతో ర్యాలీ, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రవి నాయక్, ఓంకార్, ఎరుకుల పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి రామచంద్రుడు, ఇతర సంఘాల నాయకులు మాట్లాడారు. అడవి తల్లినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న గిరిజనులను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే

శ్రీనివాస్ సెంటర్లో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకులు

ఇలాంటి నిర్ణయాలు తీసుకొని వారిని రోడ్డుపాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అభివృద్ధి చెందిన బిసి కులాలను ఎస్టి జాబితాలో చేరిస్తే గిరిజనుల జీవన విధానంపై ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలు తీసుకున్నవారవు తారని మండిపడ్డారు. తీర్మానాన్ని వెనక్కి తీసుకోకపోతే ఓటు బ్యాంకుతో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున, తిరుపాలు, సుంకన్న, సుంకన్న, ఉషారాణి, లక్ష్మీబాయి, ఆలిండియా బంజారా సంఘం నాగేష్ నాయక్, ఆయా మండలాల నాయకులు, వైసిపి ఎస్టీ సెల్ నీలా నాయక్, అశోక్ నాయక్ సురేష్ నాయక్, ఈశ్వర్, సుంకన్న, అన్ని సంఘాల గిరిజనులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మునిసిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైస్సార్ ఆసరాను మహిళలు ఆర్థిక అభివృద్ధికి ఉపయోగించుకోవాలని నంద్యాల మునిసిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) వారి ఆధ్వర్యంలో 41, 8, 42, 14, 16, 24వ వార్డులలో వైయస్సార్ ఆసరా 3వ విడత సంబరాలు సంబంధిత కౌన్సిలర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ హాజరై మాట్లాడారు. సిఎం జగనన్న ఇచ్చిన మాట మేరకు మూడవ విడత ఆసరా అమౌంట్ సంబంధిత సంఘాలకు విడుదల చేశారన్నారు. జగనన్న ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ అనేక ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత వార్డు కౌన్సిలర్, స్టేట్ బెస్త కార్పొరేషన్ డైరెక్టర్, వార్డు ఇంచార్జిలు, మెప్మా సిఎంఎం, టిఎంసి, సిఒలు, ఆర్‌పిలు, సచివాలయ సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఆసరా మూడో విడత సంబరాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ఖుద్బా వీధి సచివా లయం-7 వద్ద శనివారం వైయస్ఆర్ ఆసరా మూడవ విడత సంబరాలు, మహిళ సంఘం సభ్యులతో ముఖాముఖి కార్యాక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా వార్డ్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ ఎవి రమేష్ బాబు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు వెంకట సుబ్బయ్య, లక్ష్మీదేవి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షులు బద్రి నాగేశ్వరమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్గనైజర్లు మాట్లాడుతూ 2020-2021 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడత 695 స్వయం సహాయక సంఘాలకు, 5700 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4.86 కోట్లు, 2021-22కు 2వ విడత 710 స్వయం సహాయక సంఘాలకు, 5795 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.5.03 కోట్లు, 2022-23కు 705 అర్హత గల సంఘాలకు, 5775 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4.93 కోట్లు మంజూరయినట్లు చెప్పారు. 11, 12 వార్డులకు సంబంధించి ఏడవ సచివాలయంలో 71 స్వయం సహాయక సంఘాలకు రూ.58.96 లక్షల నిధులు విడుదలయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఎఫ్ఓబి, సమాఖ్య రిసోర్స్ పర్సన్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, పొదుపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలోని వెల్దుర్తి రోడ్డులో శ్రీ చౌడేశ్వరి మాత తిరుణాల జ్యోతి మహోత్సవాలు శుక్రవారం అర్ధరాత్రి నుండి శనివారం ఉదయం తెల్లవారుజాము వరకు వైభవంగా జరిగాయి. బేతంచర్లలోని సుంకులమ్మ ఆలయం నుండి చౌడేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంపై అమ్మవారిని కొలువుంచి భక్తుల జన సందోహం మంగళ వాయిద్యాలతో పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కళాకారులు వేసిన శివపార్వతుల, మహిషాసుర మర్దిని ఆంజనేయ స్వామి రాక్షసులు, తదితర వేషధారణలో చేసిన నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతోగానో ఆకర్షించాయి. బేతంచెర్ల పోలీసు వారు అమ్మవారి జ్యోతుల ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా బందోబస్తు నిర్వహించారు.

వేషాధారణలతో నృత్యాలు చేస్తున్న దృశ్యం

97.36 శాతం

- నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని ఆస్తి పన్నుతో సహ ఇతరితర 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను 97.36 శాతం వసూలు చేసినట్టు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు శనివారం తెలిపారు. బేతంచెర్ల నగర పంచాయ తీలో విలేకరుల సమావేశంలో చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని పన్నులకు సంబంధించి రూ.కోటి 80 లక్షలకు గాను ఒక్క రూ.కోటి 75 లక్షలు వసూలు చేసినట్టు తెలిపారు. మార్చి 31వ తేదీ నాటికి ఈ మొత్తాన్ని నగర పంచాయతీకి సంబంధించిన అధికారులు సిబ్బంది కలిసి

మాట్లాడుతున్న చలం రెడ్డి

వసూలు చేసినట్లు తెలిపారు. నగర పంచాయతీకి సంబంధించిన పన్నులు వసూలలో సహకరించిన నగర పంచాయతీ పన్నుదారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సుజాత, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అమ్జాద్ బాష, విష్ణు, రమణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

హోసన్న వృద్ధాశ్రమానికి వంట సామగ్రి అందజేత

వృద్ధాశ్రమ నిర్వాహకులు జాన ప్రభాకర్‌కు వంట సామాగ్రి అందజేస్తున్న ఎం ఆర్ ఫ్ టైర్ సిబ్బంది

ప్రజాశక్తి-డోన్

డోన్ మార్కెట్ యార్డ్ దగ్గర ఉన్న ఎంఆర్‌ఫ్ టైర్ షాప్ యజమాని లక్ష్మీనారాయణ హోసన్నా వృద్ధాశ్ర మానికి శనివారం నాడు వంట సామాగ్రి, భోజనాలను అందించినట్లు హోసన్నా వృద్ధాశ్రమ నిర్వాహకులు జాన.ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధుల పట్ల ఆదరణ చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఫీ మస్తాన్ ఆశ్రమ సూపర్వైజర్ భారతి పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - ప్యాపిలి

చదువుతో జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలని రాచర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోగట సురేష్ బాబు విద్యార్థులకు సూచించారు. బూరుగల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. మెట్టుపల్లి పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ధర్మన్నగారి చిన్నపరెడ్డి, తన తల్లి ధర్మన్నగారి సుభాషిణి జ్ఞాపకార్థం పదవ తరగతి విద్యార్థులకు అట్ట, జామెట్రి బాక్స్, పెన్నులు, పెన్సిల్లు,రబ్బరు, షార్ప్ నర్, లాంగ్ స్కేల్ తదితర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూరుగల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధ, రాచర్ల ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, ఉపాధ్యాయులు శేషయ్య, వేంకటేశ్వర్లు,చంద్రశేఖర్ నాయక్,దస్తగిరి, హుస్సేన్ వలి,జ్యోతి, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంచిన ఉపాధ్యాయులు

నేటి నుండి లక్ష్మీ కంబగిరి స్వామి మహోత్సవాలు

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని ఎర్రమల కొండల్లో స్వయంభుగా వెలసిన లక్ష్మీ కంబగిరి స్వామి తిరు కళ్యాణ మహోత్సవాలు నేటి నుండి ప్రారంభమవు తున్నట్లు ఆలయ ధర్మకర్త చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2వ తేదీ అంకురార్పణ, ధ్వజారోహణ, దీక్ష ప్రారంభం, శ్రీవారు కొండపైకి వెళ్ళుట, 3న హనుమత్ వాహన సేవ, 4న గరుడ వాహన సేవ, 5న గజవాహన సేవ, పర్వ రాయబారం శ్రీవారి తరుపువారు కొండపైకి చేరుట, 6న స్వామివారి కళ్యాణ మహోత్సవం, సాయంకాలం రథోత్సవం, 7న పూర్ణాహుతి, వసంతోత్సవం, పారువేట, రాత్రి స్వామి వారు ఉప్పలపాడు గ్రామం చేరుకొనుట అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

ఎండియు ఆపరేటర్లు ఆందోళన

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని ఎండీయూ ఆపరేటర్లు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండీయూ వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్ డబ్బులు సంబంధిత బ్యాంకర్లు ఆపరేటర్ల అకౌంట్ల నుంచి బ్లాక్ చేసి తీసుకోవడం దారుణం అన్నారు. వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్ నగదును ప్రభుత్వమే చెల్లిస్తామని చెప్పి, ఇలా చేయడం తగదన్నారు. ప్రభుత్వం ఇన్సూరెన్స్ నగదు చెల్లించి తమ నుంచి తీసుకున్న ఇన్సూరెన్స్ నగదును తిరిగి ఇప్పించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని, రేషన్ పంపిణీ చేయమని వారు తెలియజేశారు. ఎండీయూ ఆపరేటర్లు షరీఫ్ రమేష్, పొల్లకాయల మనోజ్ఞ,గోపాల్,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

5న వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలస్థాయిలో ఈ నెల 5న వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుబ్బరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5న నిర్వహించే వైయస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. సిసిలు మద్దిలేటి, ఒబులేష్, ఎపి మద్దిలేటి, పుల్లయ్య, గ్రామ పంచాయతీల విఒఎలు పాల్గొన్నారు.

బాలామృతం బలవర్ధక ఆహారం

ప్రజాశక్తి- కొలిమిగుండ్ల:

బాలామృతం పిల్లలకు ఎంతో బలవర్ధకమైన ఆహారమని సూపర్వైజర్ పావని అన్నారు. శనివారం తిమ్మనాయని పేట అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి కార్యకర్తలు పౌష్టిక ఆహార పక్షోత్సవాలలో భాగంగా బాలామృతంపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా బాలమృతం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమ ంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చింతలాయపల్లె వసుంధర తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంగన్వాడి కార్యకర్తలు

పక్కా గృహాలకు రూ. 5 లక్షలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

జగనన్న కాలనీలోని పక్కా గృహాలకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, మండల నాయకులు రాజు, సుబ్బరాయుడు, డివైఎఫ్ఐ నాయకులు రాజేష్‌లు డిమాండ్ చేశారు. శనివారం బండి ఆత్మకూరు మండల కేంద్రంలోని జగనన్న కాలనీ వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చే రూ.1,80,000 ఏమాత్రం సరిపోదని, నిర్మాణ వ్యయం ఎక్కువగా ఉందని, ఐదు లక్షలు ఇస్తే కానీ నిర్మాణాలు చేపట్టలేరని అన్నారు. జగనన్న కాలనీలకు మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జయన్న, శ్రీనివాసులు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూరు జగనన్న కాలనీ పరిశీలించిన సిపిఎం నాయకులు

సమాజ సేవలోనే సంతృప్తి

ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్‌ఏ శాంతి

ప్రజాశక్తి-డోన్

సమాజంలో సేవలు చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్‌ఏ శాంతి అన్నారు. శనివారం డోన్ పట్టణంలోని త్రివర్ణ కాలనీ నందు నివసిస్తున్న పాలురి లక్ష్మిదేవి నడవలేని స్థితిలో ఉన్న ఆమెకు ఏడు మంది దాతల సహకారంతో వీల్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్‌ఏ శాంతి మాట్లాడుతూ ఇన్నర్ వీల్ క్లబ్ సమాజ సేవలో ముందుంటుందని అన్నారు. సేవ చేయడానికి దాతలు ముందుకు రావడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. సేవ చేయడంలోనే నిజమైన ఆత్మ సంతృప్తి ఉంటుందని అన్నారు. నడవలేని స్థితిలో ఉన్న ఆమెకు వీల్ చైర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వీల్ చైర్ కొరకు ఆర్థిక సహాయం చేసిన వారు ఇన్నర్ వీల్ క్లబ్ అభిమానులు,సుభాష్ చంద్రబోస్, రంగనాథ రెడ్డి ఆర్టీసీ కండక్టర్లు శాంతి,ఎం.వెంకట లక్ష్మీదేవి అందించారు. అనంతరం వీల్ చైర్ తీసుకున్న ఆమె సంతోషించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు శైలజారెడ్డి,సుధా బట్,శ్రీవల్లి,ఉమ తదితరులు పాల్గొన్నారు.

పాలురి లక్ష్మిదేవి కి వీల్ చైర్ ను అందిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని 4వ వార్డు వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ ఎస్.తబ్రేజ్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నంద్యాల మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ తబ్రేజ్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం మజ్జిగ, జ్యూస్ ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రతిరోజు చల్లని మినరల్ వాటర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం వేసవిలో 45 రోజుల వరకు గత ఐదు సంవత్సరాలు నుంచి చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చైర్మన్ మాబున్నిసా, కో ఆప్షన్ మెంబర్ పడకండ్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కౌన్సిలర్ తబ్రేజ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. 3వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ సమద్ మాట్లాడుతూ తన మిత్రుడు తబ్రేజ్ సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్తా, చిన్న రామయ్య, తిరివీధి సురేష్, చెంచు గారి వేణుగోపాల్, పాన్ పట్టి గౌండ రసూల్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్ వేలంపాట

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎట్టకేలకు పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో సైకిల్ స్టాండ్‌కు వేలంపాట జరిగింది. శనివారం మున్సిపల్ అధికారులు నిర్వహించిన వేలం పాటలో నలుగురు పోటీదారులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ వారి పాట రూ.80 వేలు మొదలు పెట్టగా అత్యధికముగా రూ.1 లక్షా 35 వేలు వేలం పాడి జాకిర్ హుస్సేన్ సైకిల్ స్టాండ్‌ను దక్కించుకున్నారు. **12కు వేలం పాట వాయిదా :** లారీలు, ట్రాక్టర్లు, మోటాడోరు వ్యాన్లు, స్వరాజ్ మద్దాల మొదలగు వాటిపై తేలడు సరుకుల మీద, పశువుల సంతకు సంబంధించి అమ్ముకొను హక్కు కోసం వ్యాపారస్థుల మీద ఫీజు వసూలు చేసేందుకు మున్సిపల్ అధికారులు వ్యాపారుల నుండి శనివారం వేలం పాటకు పిలువడం జరిగింది. వ్యాపారస్తుల నుండి స్పందన లేకపోవడంతో సాయంత్రం 5:30 గంటల వరకు చూసి వేలంపాటను వాయిదా వేశారు. తిరిగి మళ్లీ ఈ నెల 12వ తేదీన వేలం పాట నిర్వహించనున్నారు.

సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని కడమల కాలువ సచివాలయ పరిధిలో కడుమల కాలువ వెంగళ్రెడ్డిపేట గ్రామాల్లో రూ 18 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణానికి చేసినట్లు ఎంపీడీవో వాసుదేవ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడమల కాలువ సచివాలయం పరిధిలోని వెంగళ్రెడ్డిపేటకు రూ 5 లక్షలు, కడమల కల్వకు రూ.13 లక్షలు చొప్పున కేటాయించిన్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే గడపగడప కార్యక్రమం జరిగిన గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి చర్యలు చెప్పుతామన్నారు. కాంట్రాక్టర్ దక్షిణేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలకు ఎలాంటి భంగం కలగకుండా సిసి రోడ్లు నిర్మిస్తామని, నాయకులు, గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఏఈ వెంకటయ్య, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు రాగాల వెంకటరమణ, వైకాపా సీనియర్ నాయకులు పబ్బతి ఏసురత్నం, పంచాయతీ కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - పాములపాడు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు షేక్షావలి (37) మృతి చెందాడు. పాములపాడు ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు ఆత్మకూరుకు చెందిన షేక్షావలి పాములపాడు మండలం మిట్ట కందల గ్రామంలో ఎంపీయుపి స్కూల్ నందు భౌతికశాస్త్రం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. శుక్రవారం పాఠశాల విధులకు హాజరయ్యేందుకు ఆత్మకూరు నుండి బయలుదేరి మిట్ట కందాల గ్రామానికి మోటార్ సైకిల్‌పై వస్తుండగా బానుముక్కల టర్నింగ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలు కావడంతో ఆత్మకూరులోని వైద్యశాలలో ప్రథమ చికిత్స నిర్వహించి కర్నూల్ వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య రుబినా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

4న చాగంటి ప్రవచనాల కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలో ఈ నెల 4న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల కార్యక్రం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శివకుమార్ రెడ్డి కోరారు. శనివారం ప్రథమనందీశ్వర దేవస్థానంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రథమ నందీశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సభకు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు హాజరవుతున్నట్లు తెలిపారు. యోగా గురువు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా 50 వేల మంది హిందూ బంధువులతో ఓంకార మంత్రం జపించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నంద్యాల పేరు నమోదు చేసే బృహత్తర కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఆడాక్టర్ గెలివి సహదేవుడు, నెరవాటి సత్యనారాయణ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు తమ వెంట మంచినీళ్ల బాటిల్ తెచ్చుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కశెట్టి కృష్ణమూర్తి, పాలూరి సుబ్బారావు, మారం శేషయ్య, మోహన్, ప్రోగ్రాం మీడియా ఇంచార్జి చింతలపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.